ప్రజా రిపబ్లిక్ స్పెషల్
ప్రతి అక్షరం ప్రజల కోసం
1
RNI No: APTEL/2023/87888
మంగళవారం
04 నవంబర్ 2025

అధికారంలోకి వస్తే.. మహిళల ఖాతాల్లోకి రూ.30వేలు:తేజస్వీ యాదవ్

పట్నా, నవంబర్ 4, (రిపబ్లిక్ న్యూస్): బిహార్ ఎన్నికల్లో మహిళా ఓటర్లను ఆకట్టుకునేందుకు ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్ కీలక హామీ ప్రకటించారు. ఇండియా కూటమి బిహార్లో ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసిన వెంటనే 'మై-బహిన్ మాన్ యోజన'ను ప్రారంభిస్తామన్నారు. ఇందులోభాగంగా జనవరి 14న సంక్రాంతి రోజున రాష్ట్రంలోని మహిళలకు ఏడాదికి రూ.30వేలు కానుకగా అందచేస్తామని వెల్లడించారు.

ఎన్నికలు సమీపిస్తోన్న తరుణంలో బిహార్ ప్రభుత్వం ఇటీవల అక్కడి మహిళలకు నవరాత్రి కానుకగా ఒక్కొక్కరికీ రూ.10వేలు చొప్పున 75 లక్షల మంది మహిళల ఖాతాల్లో డబ్బు జమ చేసిన నేపథ్యంలో తేజస్వీ ఈ ప్రకటన చేశారు. గత వారం ప్రతిపక్షాలు విడుదల చేసిన మ్యానిఫెస్టో ప్రకారం.. డిసెంబర్ 1 నుంచి మహిళలకు నెలకు రూ.2,500 ఆర్థిక సహాయంగా రాబోయే ఐదేళ్ల ఒక్కో సంవత్సరానికి మొత్తం రూ.30,000 ఇస్తామని తేజస్వీ హామీ ఇచ్చిన సంగతి తెలిసిందే. ఇందులో భాగంగానే అధికారంలోకి వచ్చిన వెంటనే మొదటి ఏడాదికి గాను మహిళలకు రూ.30వేలు ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. బిహార్ మహిళల కోరిక మేరకు ఏడాదికి చెల్లించే మొత్తం రూ.30 వేలను జనవరి 14న వారి ఖాతాలకు బదిలీ చేస్తామని తేజస్వీ తెలిపారు. కనీస మద్దతు ధరతో పాటు బోనస్ గా రైతులకు క్వింటాలు వరికి రూ.300, గోధుమలకు రూ.400 చెల్లిస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల కోసం పాత పెన్షన్ పథకాన్ని పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చారు. అంతేకాకుండా పోలీసు సిబ్బంది, ఆరోగ్య కార్యకర్తలు, ఉపాధ్యాయులు వంటి అన్నిరకాల ప్రభుత్వ సిబ్బందికి వారి సొంత జిల్లాల నుంచి 70 కిలోమీటర్ల పరిధిలో నియామకాలు అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. కాగా బిహార్ ఎన్నికల నేపథ్యంలో విపక్ష కూటమి మహాగర్బంధన్ ఇటీవల 'తేజస్వీ ప్రతిజ్ఞా ప్రణ్' పేరుతో తమ మ్యానిఫెస్టోను విడుదల చేసింది. అందులో తాము అధికారంలోకి వస్తే ప్రతి కుటుంబానికి ప్రభుత్వ ఉద్యోగం, పాత పెన్షన్ విధానం పునరుద్ధరణ తదితర హామీలను అమలు చేస్తామని పేర్కొంది.

సుక్మా అడవుల్లో మావోయిస్టుల ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ స్వాధీనం

చర్ల, నవంబర్ 4, (రిపబ్లిక్ న్యూస్): సుక్మా అడవుల్లో భద్రతా దళాలు చేపట్టిన ఓ ఆపరేషన్లో మావోయిస్టుల ఆర్డినెన్స్ ఫ్యాక్టరీని స్వాధీనం చేసుకున్నాయి. జిల్లాలోని గోంగూడ -కంచాల అడవుల్లో డీఆర్ జీ(డిస్ట్రిక్ రిజర్వ్ గార్డ్) బలగాలు మంగళవారం కూంబింగ్ చేస్తున్న క్రమంలో మావోయిస్టుల ఆయుధ ఆర్డినెన్స్ ఫ్యాక్టరీని గుర్తించాయి. భద్రతా బలగాలు ఆ ప్రాంతం నుంచి 17 రైఫిల్స్, రాకెట్ లాంచర్లు, ఆయుధాల తయారీ సామగ్రి, పరికరాలను స్వాధీనం చేసుకున్నాయి. ఈ ఘటనను ఎస్పీ కిరణ్ చవాన్ ధ్రువీకరించారు. మావోయిస్టులు జనజీవన స్రవంతిలోకి వచ్చి చక్కటి జీవితాన్ని ప్రారంభించుకోవాలని ఎస్పీ సూచించారు. డీఆర్డీ వ్యూహాత్మక ఆపరేషనను ఆయన అభినందించారు.

లాలూ తాతలు దిగొచ్చినా.. ఆ సొమ్ము దోచుకోలేరు:అమిత్ షా

నవంబర్ 4, (రిపబ్లిక్ న్యూస్): బిహార్ జంగిల్రాజ్ (ఆటవిక పాలన) తిరిగి రావద్దంటే ఎన్డీఏ కూటమిని గెలిపించాలని కేంద్ర మంత్రి అమిత్ షా బిహార్ ఓటర్లను కోరారు. దర్భాంగాలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న అమిత్ మాట్లాడుతూ.. బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో మోదీ-నీతీశ్ అభివృద్ధి మోడల్కు, ఆర్జేడీ జంగిల్రాజ్కు మధ్య పోటీ జరుగుతోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న జీవికా దీదీల ఖాతాలలో జమైన సొమ్మును ఆర్జేడీ నేతలు దోచుకోవాలని చూస్తున్నారంటూ ధ్వజమెత్తారు. లాలూ తాతలు దిగొచ్చినా.. ఆ సొమ్మును దోచుకోలేరన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం బిహార్ ను సమగ్ర అభివృద్ధి వైపు నడిపిస్తుందన్నారు.

సామాజిక మాధ్యమాల్లో తప్పుడు పోస్టులను సహించం:మంత్రి అనిత

అమరావతి, నవంబర్ 4, (రిపబ్లిక్ న్యూస్): రైతుల త్యాగంతోనే రాజధాని అమరావతి నిర్మాణం జరుగుతోందని రాష్ట్ర హోంమంత్రి అనిత అన్నారు.

తుళ్లూరులో డీఎస్పీ కార్యాలయాన్ని ప్రారంభించిన సందర్భంగా ఆమె మాట్లాడారు. "కేంద్ర ప్రభుత్వ సహకారంతో అమరావతి నిర్మాణం పూర్తిచేస్తాం. పోలీసులకు కావాల్సిన మౌలిక సదుపాయాలు కల్పిస్తాం. వారి ఆరోగ్యం, భద్రతకు ప్రాధాన్యమిస్తాం. ప్రతిపక్షాల ఆరోపణలను దీటుగా ఎదుర్కొంటాం. పోలీసులపై తప్పుడు ప్రచారం చేయడం తగదు. సామాజిక మాధ్యమాల్లో తప్పుడు పోస్టులను సహించం. పోలీసులకు నూతన సాంకేతికతను అందిస్తాం. 6100 పోస్టులను భర్తీ చేస్తున్నాం" అని అనిత అన్నారు.

మంత్రి అజారుద్దీన్కు శాఖల కేటాయింపు

హైదరాబాద్, నవంబర్ 4, (రిపబ్లిక్ న్యూస్): ఇటీవల మంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన అజారుద్దీన్కు తెలంగాణ ప్రభుత్వం శాఖలు కేటాయించింది. మైనార్టీల సంక్షేమం, పబ్లిక్ ఎంటర్ప్రైజెస్ శాఖలను కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర మంత్రిగా అజారుద్దీన్ గత నెల 31న ప్రమాణ స్వీకారం చేశారు. రాజ్భవన్లోని దర్బార్ హాల్ లో జరిగిన కార్యక్రమంలో గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ.. ఆయనతో ప్రమాణం చేయించారు.

వివేకా హత్య కేసు.. సీబీఐ కోర్టులో సునీల్యాదవ్ కౌంటర్ దాఖలు

కడప, నవంబర్ 4, (రిపబ్లిక్ న్యూస్): మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో ఏ2 నిందితుడిగా ఉన్న సునీల్ యాదవ్ నాంపల్లిలోని సీబీఐ కోర్టులో కౌంటర్ దాఖలు చేశాడు. ఈ కేసులో అనేక అంశాలు వెలుగులోకి రావాల్సి ఉందని పేర్కొన్నాడు.

"కడప జైల్లో దస్తగిరిని డాక్టర్ చైతన్యరెడ్డి బెదిరించిన ఘటనపై సీబీఐ ఎందుకు దర్యాప్తు చేయలేదు? 2017 ఎమ్మెల్సీ ఎన్నికల్లో వివేకా ఓటమి వెనుక అవినాష్రెడ్డి కుట్ర కోణంపై తేల్చాలి. వివేకా కేసులో ఆరుగురు సాక్షుల మరణాల పై సీబీఐ ఎందుకు దర్యాప్తు చేయలేదు? కల్లూరు గంగాధర్రెడ్డి అనంతపురం ఎస్పీకి ఫిర్యాదు చేసిన తర్వాత ఎందుకు రక్షణ కల్పించలేకపోయారు? ఈ కేసులో ఇంకా అనేకమంది ప్రముఖులను విచారించాల్సిన అవసరముంది. ఈ కేసులో తప్పు చేయకపోతే దర్యాప్తు వద్దని మిగిలిన నిందితులందరూ ఎందుకు అభ్యంతరం చెబుతున్నారు?" అని సునీల్ యాదవ్ పేర్కొన్నాడు.

రిపబ్లిక్ సినిమా CINEMA

'రాజా సాబ్' వాయిదాపై క్లారిటీ.. ప్రీరిలీజ్ ఈవెంట్ ఎక్కడంటే..!

ప్రభాస్ హీరోగా మారుతి దర్శకత్వంలో రూపొందుతోన్న చిత్రం 'ది రాజా సాబ్. ఈ సినిమా మరోసారి వాయిదా పడనుందంటూ కొన్ని రోజులుగా వార్తలు వస్తున్నాయి. తాజాగా ఈ ప్రచారంపై నిర్మాణసంస్థ స్పందించింది. అనుకున్న సమయానికే విడుదల చేస్తామని స్పష్టం చేసింది."ప్రస్తుతం 'రాజా సాబ్కు సంబంధించిన వీఎఫ్ఎక్స్, పోస్ట్ ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. జనవరి 9న అన్ని భాషల్లో ఒకేసారి విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నాం. ఐమాక్స్ వెర్షన్తో సహా అన్ని ఫార్మేట్లలో ఒకేసారి ప్రేక్షకుల ముందుకురానుంది. డిసెంబర్లో అమెరికాలో భారీ ఎత్తున ప్రీ రిలీజ్ ఈవెంట్ జరపనున్నాం. డిసెంబర్ 25లోపు అన్ని పనులు పూర్తిచేసి ఫస్ట్ కాపీని సిద్ధం చేస్తాం. ఈ సంక్రాంతికి అన్ని థియేటర్లలో సందడిని రెట్టింపు చేసేందుకు 'రాజా సాబ్ సిద్ధమవుతున్నాడు. విశ్వప్రసాద్ ఎక్కడా రాజీ పడకుండా దీన్ని నిర్మిస్తున్నారు. మారుతి ప్రతి విషయంలోనూ రెట్టింపు శ్రద్ధ తీసుకొని దీన్ని సిద్ధం చేస్తున్నారు" అని నిర్మాణ సంస్థ నోట్ విడుదల చేసింది. మారుతి - ప్రభాస్ కాంబోలో వస్తోన్న తొలి చిత్రమిది. హారర్ కామెడీ నేపథ్యంలో ముస్తాబవుతోంది. ప్రభాస్ సరసన నిధి అగర్వాల్, మాళవిక మోహనన్, రిద్ది కుమార్ కథానాయికలుగా కనిపించనున్నారు. సంజయ్ దత్ కీలక పాత్రలో నటిస్తున్నారు. మొదట ఈ సినిమాను డిసెంబర్లో ప్రేక్షకుల ముందుకుతీసుకురావాలని భావించారు. ఆ తేదీ కుదరకపోవడంతో జనవరి 9కు వాయిదా వేశారు.

పాత్రికేయులు కావలెను
తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న
రిపబ్లిక్
తెలుగు దినపత్రికలో తెలుగు రాష్ట్రాలలో బ్యూరోలు, జిల్లా స్టాఫర్లు, నియోజకవర్గ మరియు మండల స్థాయి పాత్రికేయులు కావలెను.
ఆసక్తి గలవారు సంప్రదించండి
9948814188 9985876888

రిపబ్లిక్ స్పోర్ట్స్

భారత మహిళల జట్టు విజయోత్సవ ర్యాలీ ఎప్పుడంటే..:బీసీసీఐ

మహిళల వన్డే వరల్డ్ కప్పు తొలిసారిగా భారత జట్టు కైవసం చేసుకుంది. ఫైనల్లో దక్షిణాఫ్రికాను 52 పరుగుల తేడాతో మట్టి కరిపించి విశ్వవిజేతగా నిలిచింది. అయితే టీమ్ ఇండియా విజయోత్సవ ర్యాలీ ఇప్పుడే జరిగే అవకాశాలు కనిపించడం లేదు. ఈ విషయాన్ని బీసీసీఐ సెక్రటరీ దేవ్జిత్ సైకియా వెల్లడించారు. దుబాయ్స్ ఐసీసీ సమావేశాలు నవంబర్ 4 నుంచి 7 వరకు జరగనున్నాయి. ఇవి ముగిసిన తర్వాత, సీనియర్ అధికారులు భారత్కు తిరిగి వచ్చిన అనంతరమే విజయోత్సవం నిర్వహించే అవకాశమున్నట్లు తెలుస్తోంది. 'ప్రస్తుతానికైతే విజయోత్సవ ర్యాలీని ప్లాన్ చేయలేదు. నేను ఐసీసీ సమావేశాల్లో పాల్గొనడం కోసం దుబాయ్ వెళ్తున్నా. ఇంకా చాలామంది అధికారులు కూడా వస్తున్నారు. మేం తిరిగి వచ్చాక.. నిర్ణయం తీసుకుంటాం' అని బీసీసీఐ కార్యదర్శి దేవత్ సైకియా.. ముంబయి ఎయిర్పోర్ట్ మీడియాతో అన్నారు. అలాగే.. ఆసియా కప్ ట్రోఫీ భారత్కు ఇంకా చేరని విషయాన్ని ఐసీసీ దృష్టికి తీసుకెళతామని సైకియా వెల్లడించారు. 'మేం ఆసియా కప్ ట్రోఫీ విషయాన్ని ఐసీసీ దృష్టికి తీసుకెళతాం. ట్రోఫీని గౌరవప్రదమైన మార్గంలో తిరిగి తెచ్చుకుంటామనే ఆశాభావంతో ముందుకెళుతున్నాం' అని ఆయన వివరించారు. పాకిస్థాన్ ప్రేరేపిత తీవ్రవాదులు పహల్గాంపై ఉగ్రదాడి చేసిన తర్వాత ఇరుదేశాల మధ్య ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో ఆసియా కప్ మ్యాచ్ల సందర్భంగా భారత ఆటగాళ్లు.. పాక్ క్రికెటర్లతో కరచాలనం చేయడానికి ఆసక్తి చూపలేదు. టీమ్ ఇండియా ఫైనల్లో పాకిస్థాన్ను చిత్తు చేసి.. ఆసియా కప్ విజేతగా నిలిచిన విషయం తెలిసిందే. అయితే పాక్కు చెందిన ఆసియా క్రికెట్ కౌన్సిల్ చీఫ్ నఖ్వీ నుంచి ట్రోఫీని అందుకునేందుకు భారత ఆటగాళ్లు నిరాకరించారు. నఖ్వీ హుందాగా.. మరొకరితో ట్రోఫీ, మెడళ్లను భారత్కు అందించే ప్రయత్నం చేయకుండా.. వాటిని తనతోపాటు తీసుకు వెళ్లిపోయాడు. అప్పటినుంచి ఈ వివాదం కొనసాగుతోంది. ఈ విషయమై బీసీసీఐ.. ఆసియా క్రికెట్ కౌన్సిల్కు లేఖ సైతం రాసినప్పటికీ సమస్య ఇంకా పరిష్కారం కాలేదు.

అందం

జుట్టుకి సంబంధించిన అన్నీ సమస్యల్ని దూరం చేసే వేపనూనె, ఇంట్లోనే తయారు చేయండమెలా

వేపతో ఎన్నో లాభాలున్నాయి. దీనిని రాస్తే చాలా సమస్యలు దూరమవుతాయి. అందులో ఒకటి జుట్టు రాలడం కూడా తగ్గడం. దీనికోసం వేప నూనెని ఎలా తయారు చేయాలి, ఎలా వాడాలి, ఇదెలా పనిచేస్తుందో తెలుసుకోండి.

వేపలో ఎన్నో అద్భుత గుణాలు ఉన్నాయి. ఇది చర్మ, జుట్టు సమస్యల్ని దూరం చేస్తుంది. వేపలో యాంటీ సెప్టిక్, యాంటీ ఫంగల్, యాంటీ బ్యాక్టీరియల్ గుణాలు ఉన్నాయి. దీనిని బ్యూటీ రొటీన్లో చేర్చడం వల్ల అందానికి సంబంధించిన చాలా సమస్యలు దూరవ-ంవుతాయి. దీనిని జుట్టు, చర్మ సమస్యల్ని దూరం చేసేందుకు వాడుకోవచ్చు. దీనిలోని అద్భుత గుణాలు జుట్టు, చర్మానికి మేలు చేస్తాయి.



ఎలా తయారు చేయాలి

- వేప నూనెని కూడా ఇంట్లోనే తయారు చేయొచ్చు. దీనికోసం
- తాజా వేపాకుల్ని తీసుకోవాలి.
- వీటన్నింటిని శుభ్రంగా క్లీన్ చేయాలి. తర్వాతి వీటన్నింటిని గ్రైండ్ చేసి పేస్టులా చేయాలి.
- ఇప్పుడు ఈ పేస్టుని కొబ్బరి లేదా ఆలివ్ ఆయిల్లో కలపండి.
- ఇప్పుడు కలిపిన మిశ్రమాన్ని డబుల్ బాయిల్ మెథడ్లో వేడి చేయండి.
- వేడి చేసిన నూనె రంగు మారుతుంది. అప్పుడు మంటని తగ్గించండి.
- ఇప్పుడు తయారైన నూనెని పల్చని గుడ్డ లేదా ఫిల్టర్లో వేసి ఫిల్టర్ చేయండి.
- అందులోనుంచి వచ్చిన నూనెని గాజు సీసాలో స్టోర్ చేయండి.

ఎలా వాడాలి

ఇలా తయారైన వేపనూనెని వారానికి రెండు సార్లు మీ స్కాల్ప్, హెయిర్కి మసాజ్ చేయండి. దీంతో జుట్టు సమస్యలు ఏవైనా కూడా దూరమై జుట్టు చక్కగా పెరుగుతుంది. జుట్టుకి నూనెని రాసి మెల్లిగా మసాజ్ చేయాలి. దీంతో స్కాల్ప్పై రక్త ప్రసరణ కూడా పెరుగుతుంది.

ఎప్పుడు క్లీన్ చేయాలి

తలకి ఈ నూనె రాసిన తర్వాత గంటసేపు అలానే ఉంచాలి. లేదంటే, ఇబ్బంది లేదనుకుంటే రాత్రంతా కూడా ఉంచొచ్చు. కానీ, కొద్దిగా చేదుగా వాసన వస్తుంది. కాబట్టి, గంటసేపు అలానే ఉంచి ఆ తర్వాత మైల్డ్ షాంపూతో షాంపూ చేసుకోవాలి.

ఇంకెన్ని విధాలుగా వాడొచ్చు

ఇప్పుడు ఈ నూనెని హెయిర్ కేర్ రొటీన్లో రకరకాలుగా వాడొచ్చు. దీనికోసం ఆయిల్ని తీసుకుని మీ షాంపూలో కూడా కలిపి షాంపూ చేయంచ్చు. దీంతో కుదుళ్లు, జుట్టుకి బాగా రాయండి.

కండీషనింగ్

ఈ నీమ్ ఆయిల్ని కండీషనర్లో కలిపి జుట్టుకి అప్లై చేసి కాసేపు ఉంచి ఆ తర్వాత షాంపూ చేయొచ్చు. దీంతో తలలో ఇరిటేషన్ తగ్గుతుంది. స్కాల్ప్ కూడా హెల్దీగా ఉంటుంది.

లాభాలు

ఈ నూనెని హెయిర్కేర్ రొటీన్లో యాడ్ చేసి మసాజ్ చేయడం వల్ల హెల్దీ సెల్స్ పెరుగుతాయి. బ్లడ్ సర్క్యులేషన్ పెరుగుతుంది. దీంతో హెయిర్ఫోలికల్స్ బలంగా మారి జుట్టు పొడుగ్గా పెరుగుతుంది. దీంతో జుట్టు పల్చబడదు. ఊడిపోదు, పొల్యూషన్, స్ట్రెస్, మెడికేషన్ వల్ల జుట్టు రాలే సమస్యలుంటే అవి కూడా తగ్గిపోతాయి. ఈ నూనెలోని యాంటీ ఇన్ఫ్లమేటరీ, యాంటీ బయాటిక్, యాంటీ ఆక్సిడెంట్ గుణాలు బట్టతలని తగ్గిస్తాయి. దీంతో పాటు సోరియాసిస్ని దూరం చేస్తాయి. జుట్టు రాలడాన్ని తగ్గించి జుట్టు బలంగా, ఒత్తుగా పెరిగేలా చేస్తాయి.

చుండ్రు

చుండ్రుతో బాధపడేవారికి ఈ నూనె వరమని చెప్పొచ్చు. దీనిని రాయడం వల్ల జుట్టు డ్రైగా మారదు. ఇందులోని యాంటీ ఫంగల్ గుణాలు డాండ్రఫ్ని తగ్గిస్తుంది.

పేలు

వేప నూనె రాయడం వల్ల పేల సమస్య తగ్గుతుంది.

దీంతోపాటు జుట్టు బ్రేకేజ్ అవ్వడం వంటి సమస్యల్ని తగ్గించి జుట్టు బలంగా మారేలా చేస్తుంది. ఇందులోని అద్భుత గుణాలు జుట్టుని మాయిశ్చరైజ్ అయ్యేలా చేస్తాయి. దీంతో జుట్టు ఆరోగ్యంగా, ఒత్తుగా పెరిగేలా చేస్తాయి.

తెల్ల వెంట్రుకలు

ఈ నూనె రాయడం వల్ల జుట్టు తెల్లబడకుండా ఉంటుంది. రెగ్యులర్గా రాస్తే కచ్చితంగా జుట్టు తెల్లబడడం కాస్తా కంట్రోల్ అవుతుంది.

సైడ్ ఎఫెక్ట్స్

ఇన్ని లాభాలున్న వేప నూనె జుట్టుపై కొన్నిసార్లు సైడ్ ఎఫెక్ట్స్ని కూడా చూపిస్తుంది. మరీ సున్నితంగా ఉండే తలపై ఈ వేపనూనె రాస్తే మంట, చికాకు వంటి సమస్యలొస్తాయి. కాబట్టి, ఈ నూనెని రాసే ముందు ప్యాచ్ టెస్ట్ చేయడం మంచిది.

గమనిక: నిపుణులు, అధ్యయనాల ప్రకారం ఈ వివరాలను అందించాం. ఈ కథనం కేవలం మీ అవగాహన కోసమే. అందం, ఆరోగ్యానికి సంబంధించిన ఏ చిన్న సమస్య ఉన్నా వైద్యులను సంప్రదించడమే ఉత్తమ మార్గం. గమనించగలరు.